క్లుప్తంగా

జెడ్పీ సీఈవో ఆకస్మిక తనిఖీ

కడెం: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని శుక్రవారం ఉదయం 10 గంటలకు జెడ్పీ సీఈవో గోవింద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీఈవో కార్యాలయానికి వచ్చినా.. 10:30 గంటల వరకు ఎంపీడీవోతో సహా సిబ్బంది ఎవరూ కార్యాలయానికి రాలేరు. ఈ విషయమై సీఈవో మాట్లాడుతూ సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అన్నింటా.. అతివ



అన్ని పనులు చేసే మహిళ చిత్రాన్ని గీసిన ఉపాధ్యాయురాలు సుజాత

నిర్మల్: వంటింట్లో గరిటె తిప్పే దగ్గరి నుంచి అంతరిక్షంలో విశ్వరహస్యాలు తెలుసుకునే దాకా అన్నిచోట్ల ఆమెనే. ఇంటి పనులు, పిల్లలు,పెద్దల బాగోగులతోపాటు ఉద్యోగ బాధ్యతలనూ సమర్థవంతంగా నిర్వహిస్తోంది మహిళా దినోత్సవం నేపథ్యంలో ఖానాపూర్‌లోని తిమ్మాపూర్ జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయురాలు కె.సుజాత ఇలా చిత్రాన్ని గీసి అతివల జీవితాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారు.

పోర్టల్‌లో నమోదు చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: ఆరోగ్య వివరాలు హెచ్ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని డీఎంహెచ్‌వో రాజేందర్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల డాటా ఎంట్రీ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. జిల్లా డాటా మేనేజర్ గంగాధర్ పోర్టల్‌లో నమోదుపై ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి రవీందర్, డిప్యూటీ స్టాటస్టికల్ ఆఫీసర్ ఇషాక్, ఆరోగ్య పర్యవేక్షకుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సత్యనారాయణ వ్రతాలు

ఖానాపూర్: పట్టణంలోని వాసవిమాత ఆలయ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. అంతకముందు అర్చకులు అభిషేక్‌శర్మ ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు చేపట్టారు. సుధాకర్, కిషన్, ఆనంద్, రవీందర్, పద్మజ, శ్రీలత, స్వరూపరాణి తదితరులు ఉన్నారు.

వాహనం ఢీ.. గద్దె ధ్వంసం

కుభీర్: మండలకేంద్రంలోని రాజురా ఎక్స్‌రోడ్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహం గద్దెను శుక్రవారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో గద్దె కొంత మేర కూలిపోయింది. బీఆర్ఎస్ నాయకుడు పుప్పాల పిరాజీ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు వచ్చి సీసీటీవీ ఫుటేజీ పరిశీలించి పలు వివరాలు నమోదు చేసుకున్నారు.

మలక్‌చించోలిలో వైద్యశిబిరం

సారంగపూర్: మండలంలోని మలక్‌చించోలి గ్రామంలో వందన హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు దుర్గాప్రసాద్ గ్రామస్తులను పరీక్షించారు. వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. నిర్వాహకులు వల్లకొంట సురేశ్, మైస శేఖర్, సతీశ్‌కుమార్, బీజేపీ మండలాధ్యక్షుడు కాల్వ నరేశ్, అంబటి గంగాధర్, కార్తీక్, రమేశ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ముగిసిన ఇసుక వేలం

ఖానాపూర్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఇటీవల సీజ్ చేసిన ఇసుక నిల్వలకు తహసీల్దార్ సుజాత ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. రూ.ఐదు వేలు చెల్లించి ఆకుల నర్సయ్య, పానగంటి రాజేందర్, సుబ్బు వేలంలో పాల్గొన్నారు. పానగంటి రాజేందర్ 27 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను రూ.49,950కు దక్కించుకున్నారని తహసీల్దార్ తెలిపారు.

ఉత్తమ వీవోఏగా మమత



అవార్డును స్వీకరిస్తున్న మమత

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామ వీవోఏ గాండ్ల మమత ఉత్తమ వీవోఏగా ఎంపికైంది. శుక్రవారం మహిళా దినోత్సవం పురస్కరించుకొని జిల్లాకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు.

ముందస్తు వేడుకలు

భైంసాటౌన్: పట్టణంలోని జీఆర్పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ముందస్తు మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాలలో మహిళా అధ్యాపకులు, ఉద్యోగులు, సిబ్బందిని శాలువాతో సన్మానించారు. మహిళా దినోత్సవం ప్రాముఖ్యతను ప్రిన్సిపాల్ బుచ్చయ్య వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ రఘునాథ్, సీపీడీసీ అధ్యక్షుడు నాగేష్ మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, వారు ఆరోగ్యంగా ఉంటే గృహం, తద్వారా సమాజం ఆరోగ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. అధ్యాపకులు ఉన్నారు.

మహిళల ప్రగతే సమాజాభివృద్ధి

- కలెక్టర్ అభిలాష అభినవ్
- కలెక్టరేట్‌లో మహిళా దినోత్సవం

నిర్మల్‌చైన్‌గేట్: మహిళల ప్రగతే సమాజాభివృద్ధి అని కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. బాలురతో సమానంగా బాలికలను పెంచాలని తెలిపారు. కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగినులకు ప్రత్యేక ఆరోగ్యశిబిరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. సోమవారం నుంచి రెండు రోజుల పాటు జిల్లాలో మహిళలకు ఆటలపోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రాధిక మాట్లాడుతూ.. మహిళల హక్కులు, చట్టాలు, రక్షణపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ.. ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక స్వావలంబన తదితర అంశాలపై మహిళలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బేటీ బచావో బేటీ పడావో పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయా ప్రభుత్వ విద్యాసంస్థల్లో నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన మహిళా ఉద్యోగులు, సిబ్బందిని శాలువాతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఆర్డీవో రత్నకళ్యాణి, డీఆర్డీవో విజయలక్ష్మి, ఏసీడీపీవో నాగమణి, వివిధ శాఖల అధికారులు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

భారీ ర్యాలీ ప్రారంభించిన కలెక్టర్..

నిర్మల్‌చైన్‌గేట్: మహిళాశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని శివాజీ చౌక్ నుంచి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు నిర్వహించిన భారీ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో కలెక్టర్ మాట్లాడారు. బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమం అమలులోకి వచ్చి పదేళ్లవుతున్న సందర్భంగా 45రోజులుగా జిల్లాలో వివిధ కార్యక్రమాల ద్వారా మహిళల హక్కులు, చట్టాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, మహిళల రక్షణకు పలు హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. జీవితంలో మహిళల ప్రాముఖ్యతపై జిల్లాలో పురుషులకు వ్యాసరచన పోటీలు, సోమవారం నుంచి రెండ్రోజులపాటు మహిళలకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి (జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్) రాధిక, ఆర్డీవో రత్నకళ్యాణి, డీఆర్డీవో విజయలక్ష్మి, ఏసీడీపీవోలు నాగలక్ష్మి, నాగమణి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్, మెప్మా పీడీ సుభాష్, డీవైఎస్వో శ్రీకాంత్‌రెడ్డి, మిషన్ శక్తి కోఆర్డినేటర్ సరిత, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, ఎన్‌సీసీ విద్యార్థులు, పాఠశాలల విద్యార్థులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, మహిళా అధికారులు పాల్గొన్నారు.



మహిళను సన్మానిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్, పక్కన జిల్లా అధికారులు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

దస్తురాబాద్ కేజీబీవీ విద్యార్థిని ప్రతిభ

దస్తురాబాద్: బేటీ బచావో– బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఇటీవల మండలకేంద్రానికి చెందిన కేజీబీవీ విద్యార్థిని వెన్న సహస్ర వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చగా శుక్రవారం కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంది. ఉపాధ్యాయురాలు శ్రీలత, విద్యార్థిని తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

గడువులోపు అన్ని పన్నులు వసూలు చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని మున్సిపాలిటీల్లో నిర్ణీత గడువులోపు అన్ని రకాల పన్నులను వసూలు చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అన్ని మున్సిపాలిటీలలో వాణిజ్య, వ్యాపార, ఆస్తి తదితర పన్నుల వసూలు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. వందశాతం వాణిజ్య లైసెన్సుల పునరుద్ధరణ పూర్తి చేసి.. ప్రభుత్వ వాణిజ్య సముదాయాల అద్దెలను వసూలు చేయాలన్నారు. అద్దె బకాయిలు పేరుకుపోయిన దుకాణాలను సీజ్ చేయడంతోపాటు మున్సిపల్ కమిషనర్లతోసహా అధికారులందరూ క్షేత్రస్థాయికి వెళ్లి పన్నుల వసూలు తీరును పర్యవేక్షించాలని సూచించారు.

పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలి..

సోషల్ వెల్ఫేర్ పాఠశాలల అధికారులతో ఏర్పాటు చేసిన కలెక్టర్ మాట్లాడారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు, మరమ్మతుల కోసం విడుదలైన నిధులను వృథా చేయవద్దని సూచించారు. పాఠశాలల్లో అవసరమైన మరుగుదొడ్లు, వంటగదులు, ఫ్లోరింగ్, నీటిట్యాంకులు, బోర్డులు, ప్రహరీ గోడ, గేట్ల గ్రీల్స్ తదితర మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్‌గౌడ్, జాదవ్ కృష్ణ, రాజేశ్‌కుమార్, సాంఘిక సంక్షేమ వసతి గృహాల అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

నిర్మల్‌రూరల్: ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం ఫస్టియర్ ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్ష నిర్వహించారు. జిల్లాలోని 23 పరీక్షాకేంద్రాల్లో 6,838 మందికి గాను 6,423 మంది హాజరు కాగా, 415 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ కేటగిరీలో 6,206 మందికి 5,869 మంది హాజరు కాగా, 337 మంది విద్యార్థులు పరీక్ష రాయలేదు. ఒకేషనల్ కేటగిరీలో 632 మందికి గాను 554 మంది హాజరు కాగా, 78 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈవో పరశురాం తెలిపారు.

కడెం పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఐఈవో

కడెం: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని డీఐఈవో పరుశురాం, తహసీల్దార్ ప్రభాకర్ సందర్శించారు. లీకేజీ వదంతులపై పూర్తి విచారణ చేపట్టిన అధికారులు, కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు సమాచారం.

స్పృహ తప్పి కిందపడిన విద్యార్థిని..

కడెంకు పరీక్ష రాసేందుకు వచ్చిన పెంబి మండలం మందపల్లి కేజీబీవీ విద్యార్థిని మణిచందన స్పృహ తప్పి పడిపోయింది. సిబ్బంది వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. అనంతరం విద్యార్థిని పరీక్ష రాసింది.



విద్యార్థినికి సపర్యలు చేస్తున్న సిబ్బంది

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏఆర్ఎస్ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో జరుగుతున్న ఇంటర్ పరీక్షలను శుక్రవారం ఫ్లయింగ్ స్క్వాడ్ జాదవ్ బలరాం తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ సజావుగా జరిగేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 292 మంది విద్యార్థులకు గానూ 9 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ అబ్దుల్ హమీద్ తెలిపారు. ఏఆర్ఎస్ కళాశాలలో 308 మందికి గాను 34 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ రమేశ్‌నాయక్ తెలిపారు.

కుంటాల: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు 425 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 404 మంది హాజరయ్యారు. 21 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ కాసు నవీన్‌కుమార్, డీవోబీ సంతోష్ పేర్కొన్నారు.



ఎండలో తిప్పలు



శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు శివాజీచౌక్ నుంచి ఎన్టీఆర్ మినీస్టేడియం వరకు ర్యాలీ ఏర్పాటు చేశారు. ర్యాలీని ప్రారంభించాల్సిన కలెక్టర్ గంటన్నర ఆలస్యంగా వచ్చారు. దీంతో విద్యార్థులు, మహిళా ఉద్యోగులు రోడ్డుపైనే నిరీక్షించారు. ఎండలోనే ర్యాలీలో పాల్గొన్న ఓ విద్యార్థి మినీస్టేడియంలో నిరసించి పడిపోయింది. స్పందించిన సిబ్బంది నీడలోకి తీసుకెళ్లి ఓఆర్ఎస్ తాగించడంతో కుదుటపడింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

'ఆమె'కు గౌరవం



మహిళా ఉద్యోగులు, విద్యార్థులతో నిండిన గది



హాలు బయట వేచిచూస్తున్న జిల్లా అధికారులు

మహిళా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వచ్చిన జిల్లా మహిళా అధికారులు, సిబ్బంది, విద్యార్థులతో సమావేశ మందిరం పూర్తిగా నిండిపోయింది. పలువురు జిల్లా అధికారులు వారికి గౌరవం ఇస్తూ హాలు బయట వేచి చూస్తూ ఉండిపోయారు. అనంతరం కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా సివిల్ కోర్ట్ జడ్జిను సన్మానించారు. మహిళలకు గౌరవం ఇస్తూ బయట నిల్చొని గౌరవమిచ్చిన అధికారులను పలువురు అభినందించారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

నేడు విద్యుత్ సరఫరా బంద్

కుంటాల: మండలంలోని కల్లూరు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ అజీమొద్దీన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నర్సాపూర్(జి) మండలం గొల్లమాడ, కుంటాల మండలంలో ని ఓలా, లింబా(కె), కుంటాల సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఖానాపూర్: మరమ్మతుల్లో భాగంగా ఖానాపూర్, సుర్జాపూర్, కడెంతోపాటు బెల్లాల్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాంసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు.

నర్సాపూర్(జి): కొత్త స్తంభాల ఏర్పాటులో భాగంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నర్సాపూర్(జి), కుస్లి, అంజనీతాండ, గుండంపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో నిలిపివేస్తున్నామని ఏఈ శంకర్ తెలిపారు.

కుభీర్: మండలంలోని పార్డి(బి) సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ ఆదిత్యనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ఫీడర్ బ్రేకర్ ఏర్పాటు

సోన్: మండలంలోని గాంధీనగర్ ప్రజలకు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేసేందుకు శుక్రవారం మండలంలోని పాక్‌పట్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ప్రత్యేక ఫీడర్ బ్రేకర్‌ను డీఈ నాగరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. డీఈ మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా విద్యుత్, నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా బ్రేకర్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఏఈ అనిల్‌కుమార్, సబ్ ఇంజినీర్ విష్ణు, సిబ్బంది తిరుపతి తదితరులు ఉన్నారు.

జనఔషధిపై అవగాహన

లక్ష్మణచాంద: జన ఔషధి దివస్‌లో భాగంగా మండలంలోని పార్‌పెల్లిలో శుక్రవారం జనఔషధి మందులపై హెచ్ఈవో హరికుమార్‌గౌడ్.. ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, జనఔషధి కేంద్రాల్లోనే మందులు తీసుకోవాలని సూచించారు. శివక్రిష్ణ గౌడ్, ఆశాకార్యకర్తలు ఉన్నారు.

శిక్షణ తరగతులు పరిశీలించిన డీఈవో

నిర్మల్‌రూరల్: జిల్లాకేంద్రంలోని పంచశీల్ బీఈడీ కాలేజీలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎస్ శిక్షణ తరగతులను శుక్రవారం డీఈఓ రామారావు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10 నుంచి 12 వరకు పాఠశాల స్థాయిలో చేపట్టే సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. సర్వే విషయమై రిసోర్స్ పర్సన్లకు పలు సూచనలు చేశారు. కార్యాలయంలో డీఈఓ కార్యాలయ ఏఎంఓ నర్సయ్య, సూపరింటెండెంట్ వెంకటరమణ, డీసీఈబీ అసిస్టెంట్ సెక్రటరీ భానుమూర్తి, రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో రామారావు

బకాయిల వసూలుకు స్పెషల్‌డ్రైవ్

- ఖానాపూర్ మున్సిపాలిటీలో దుకాణాల సీజ్‌తో పన్నులు చెల్లించిన వ్యాపారులు

ఖానాపూర్: పట్టణంలోని పలువురు వ్యాపారులు పన్నుల చెల్లింపులో జాప్యంతోపాటు మొండి బకాయిల వసూలుకు మున్సిపల్ కమిషనర్ జాదవ్‌కృష్ణ, సిబ్బందితో కలిసి శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పన్నులు చెల్లించని ఐదు దుకాణాలను సీజ్ చేశారు. దీంతో దిగివచ్చిన వ్యాపారులు పెండింగ్ బకాయిలను చెల్లించారు. దీంతో అధికారులు దుకాణాలకు వేసిన సీల్‌ను తొలగించారు. మున్సిపల్ అభివృద్ధి, సిబ్బంది వేతనాలను దృష్టిలో ఉంచుకుని పట్టణవాసులు పన్నులు చెల్లించాలని కమిషనర్ కోరారు.



కమిషనర్‌కు పన్నులు చెల్లిస్తున్న వ్యాపారులు

ఆస్తిపన్ను కట్టలేదని.. స్టార్టర్ తీసుకెళ్లారు!

- భైంసాలో బల్దియా అధికారుల తీరు

భైంసాటౌన్: పట్టణంలోని రాహుల్‌నగర్‌లో ఆస్తి పన్ను చెల్లించలేదని మున్సిపల్ సిబ్బంది కాలనీలోని బోరుమోటారు స్టార్టర్ తీసేసిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన ఇద్దరు ఆస్తిపన్ను చెల్లించలేదని మున్సిపల్ సిబ్బంది కాలనీలోని బోరుమోటారు స్టార్టర్ ఎత్తుకెళ్లారు. దీంతో కాలనీవాసులు మున్సిపల్ సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్తిపన్ను చెల్లించకపోతే, కాలనీలోని ఇతర ఇళ్లకు నీరందించే బోరుమోటార్ స్టార్టర్ ఎత్తుకెళ్లడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. దీంతో చేసేది లేక కాలనీవాసులే సొంతంగా స్టార్టర్ కొనుగోలు చేసుకుని ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు.



బోరుమోటార్ స్టార్టర్ తీసుకెళ్లడంతో దిగులుగా చూస్తున్న కాలనీవాసులు

అభివృద్ధి నిరోధకుడు మహేశ్వర్‌రెడ్డి

- మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ నియోజకవర్గ అభివృద్ధి నిరోధకుడు ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక ఐబీ వద్ద నిర్మిస్తున్న హరిత హోటల్ పనులను ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. సదరు ప్రదేశంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నిర్మిస్తామనడం సరికాదన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఉండగా మరొకటి ఎందుకని ప్రశ్నించారు. పర్యాటకులకు ఉపయోపడే హరిత హోటల్ నిర్మాణం అడ్డుకోవద్దని సూచించారు. మహేశ్వర్‌రెడ్డి మన ప్రాంత నాయకుడు కాదని.. ఆయనకు నిర్మల్ నియోజకవర్గంపై ప్రేమ లేదన్నారు. తాగునీటిని, చెక్‌డ్యాంలు, ఫ్యాక్టరీల ఏర్పాటును అడ్డుకుంటున్నాడని వివరించారు. ఆయన అధికారంలోకి వచ్చి 15 నెలలవుతున్నా.. పట్టణంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. సమావేశంలో పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, ధర్మాజీ రాజేందర్, పాకాల రాంచందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇంద్రకరణ్ రెడ్డి

కనీస మద్దతు ధరల చట్టం చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: కనీస మద్దతు ధరల చట్టం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా, అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నంది రామయ్య డిమాండ్ చేశారు. జాతీయ నాయకత్వం పిలుపు మేరకు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలపై సంయుక్త కిసాన్ మోర్చా పోరాటం కొనసాగిస్తోందని తెలిపారు. రైతాంగం 13 నెలల పాటు ఢిల్లీ రహదారులపై ధర్నాలు చేసి సాధించిన మూడు చట్టాల రద్దును దొంగ దారిలో జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ ముసాయిదా పేరుతో తీసుకు రావడం చూస్తుంటే మోదీ ప్రభుత్వం ఎవరికోసం పనిచేస్తున్నదో తెలుస్తోందన్నారు. పండిన పంటలకు మద్దతు ధర దొరకక అప్పుల పాలై అనేకమంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే మోదీ కార్పొరేట్ల కోసమే వేగంగా వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకువస్తున్నారని విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నూతన్‌కుమార్, అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి జే రాజు, టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కే రాజన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, జిల్లా కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, భూక్యా విలాస్, గంగారాం, గోరేభాయ్, సుందర్, మోహన్, గంగాధర్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

సంక్షిప్త వార్తలు

గ్రామసభ

ముధోల్: వేసవి నేపథ్యంలో నీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో శివకుమార్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి చర్చించి తీర్మానం చేశారు. ఈవో అన్వర్‌ఖాన్ తదితరులున్నారు.

నేడు మహిళా దినోత్సవం

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) భవన్‌లో జిల్లాశాఖ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు భూమన్న యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు మహిళా ఉపాధ్యాయులు వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు

లోకేశ్వరం: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని గృహనిర్మాణశాఖ డీఈ దయానంద్ అన్నారు. శుక్రవారం మండలంలోని బాగాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం మార్కింగ్ చేశారు. డీఈ దయానంద్ మాట్లాడుతూ గ్రామంలో 40 మంది నిరుపేదలకు ఇందరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని.. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఎంపీడీవో వెంకటరమేశ్, సోలమాన్‌రాజ్, జగన్నాథ్ ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

తానూరు: మండలంలోని కోలూరు బస్టాండ్ ప్రాంతంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీవో నసీరొద్దీన్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవిలో ప్రయాణికుల దాహం తీర్చడానికి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.